కార్పొరేషన్ ఉద్యోగిపై హత్యాయత్నం

తిరుపతి క్రైమ్: తిరుపతి కార్పొరేషన్ ఉద్యోగిపై గురువారం గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నం చేశారు. తెలిసిన సమాచారం మేరకు.. నగరంలోని రాయల్ నగర్‌లో నివాసముంటున్న మునిరాజా(45) తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతను గురువారం ద్విచక్ర వాహనంపై విధులకు బయలుదేరాడు. ముగ్గురు వ్యక్తులు నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై వస్తూ వెనుక నుంచి ఢీకొన్నారు. అతను కింద పడిపోగానే కత్తులతో దాడిచేశారు. అతను తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. చుట్టుపక్కల వారు అక్కడికి రావడంతో ఆ వ్యక్తులు పారిపోయారు. గాయపడిన మునిరాజాను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారు తనపై ఎందుకు దాడిచేశారో తెలియదని చెబుతున్నాడు. పోలీసులకు దీనిపై ఎలాంటి సమాచారం అందలేదు.

డ్రైవింగ్ స్కూల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎంపిక



తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా డ్రైవింగ్ స్కూల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ వజీర్‌భాషా, కార్యదర్శిగా సోంపల్లి శేఖర్‌నాయుడు ఎంపికయ్యారు. తిరుపతిలోని ఒక ప్రైవేట్ హోటల్లో గురువారం అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎంపిక చేశారు. ఉపాధ్యక్షుడుగా కోలా మురళి, సంయుక్త కార్యదర్శిగా గొర్రిపాటి మోహన్, కోశాధికారిగా రెహమాన్ రవతార్ ఫాజుల్, 10 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

నేడు వారపు సంతకు వేలం పాటలు

పాకాల: స్థానిక సచివాలయంలో వారపు సంతకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈవో మోతి తెలిపారు. పంచాయతీ పరిధిలో ఉన్న ప్రైవేటు బస్టాండు, కూరగాయల మార్కెట్, 3 షాపులు, కొబ్బరిచెట్లు, జంతువధ శాలలు, చింత చెట్లు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

గడువులోపు రీసర్వే పూర్తిచేయండి



సర్వేపై సూచనలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ, డీఆర్వో

తిరుపతి అర్బన్: గడువులోపు భూముల రీసర్వే పూర్తిచేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి రీసర్వే వేగవంతం చేయాలని రాష్ట్ర స్థాయి అధికారులు కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేశారు. అనంతరం కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, డీఆర్వో శ్రీనివాసరావు, సర్వే ఏడీ జయరాజ్‌తో కలసి జిల్లా అధికారులతో సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రౌండ్ ట్రూతింగ్ పనులు వేగవంతం చేయాలని చెప్పారు. సర్వే పూర్తయిన చోట సరిహద్దురాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రోన్ ఏరియల్ ఫ్లయింగ్ సకాలంలో పూర్తిచేయాలని తెలిపారు. బౌండరీ కన్ఫర్మేషన్, ఏరియా వ్యాలిడేషన్, సర్వే పూర్తి, ఫైనల్ రెవెన్యూ రికార్డు నిర్దేశించిన సమయంలో పూర్తి కావాలని కోరారు. జిల్లాలో 1,050 గ్రామాల్లో గాను 250 గ్రామాల్లో డ్రోన్ల ద్వారా రీసర్వే ప్రక్రియ పూర్తి కాగా మిగిలిన గ్రామాల్లోనూ సకాలంలో పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి
- 3వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రజలకు పథకాలను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లలా పరిపాలన సాగిస్తున్నారని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం కార్పొరేటర్ తమ్ముడు గణేష్, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో తిరుపతి 3వ డివిజన్‌లోని లక్ష్మీపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, వారు పొందిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హత ఉండి పథకాలు అందని వారి వివరాలు సేకరించారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, డైరెక్టర్ కడపగుంట అమరనాథ్‌రెడ్డి, నాయకులు మల్లం రవిచంద్రారెడ్డి, ఇమ్రాన్, సోమశేఖర్‌రెడ్డి, మునిరెడ్డి, కుమార్, పాండు, రాజేష్, సుబ్రమణ్యం, యమునమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్టుమెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 53,146 మంది స్వామిని దర్శించుకున్నారు. 18,655 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. టికెట్లు లేని వారికి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలవారికి 3 గంటల్లో దర్శనమవుతోంది.

బడ్జెట్ అంచనాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం



మాట్లాడుతున్న మేయర్ శిరీష

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ 2023–24 వార్షిక సంవత్సర బడ్జెట్ అంచనాలు, 2022–2023 ఆర్థిక సంవత్సరపు సవరించిన బడ్జెట్ అంచనాలపై చర్చించి, కౌన్సిల్‌లో ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపినట్లు మేయర్ శిరీష తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశమైంది. కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొని చర్చించారు. మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్‌కు ఆదాయ వనరులను పెంచేలా చర్యలు తీసుకోవాలని, ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వీఏల్‌టీ విధించాలని స్టాండింగ్ కౌన్సిల్ తీర్మానించినట్లు తెలిపారు. నగర అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా ప్రతిపాదనలకు సిఫార్సు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.కె.బాబు, నరసింహాచారి, గణేష్, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి కె.ఎల్.వర్మ, మేనేజర్ చిట్టిబాబు, సెక్రటరీ రాధిక పాల్గొన్నారు.

చిన్నతనం నుంచి సమాజ సేవ చేయాలి

తిరుపతి రూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుతో పాటు సామాజిక సేవ కూడా చేయాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్ జేవీ రమణ పేర్కొన్నారు. ఎస్వీ వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం పంచాయతీలో వారం రోజులు చేపట్టిన ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు పల్లెలకు వచ్చి అక్కడి సమస్యలను స్వయంగా గుర్తించి, పరిష్కరించేందుకు ప్రయత్నించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై అధిక దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు.

బాధ్యతల స్వీకరణ

తిరుపతి లీగల్: తిరుపతి సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిల కోర్టుల్లో ప్రభుత్వం తరపున కేసులు వాదించడానికి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ఎస్‌జీ వెంకటరామయ్య నియమితులయ్యారు. ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు.

భూమన కుటుంబానికి రుణపడి ఉంటా



అభినయ్‌రెడ్డిని సత్కరిస్తున్న తలారి రాజేంద్ర

తిరుపతి మంగళం: ఉన్నత పదవి కల్పించిన భూమన కుటుంబానికి జీవితాంతం రుణపడి వుంటానని వైఎస్సార్ సీపీ సేవాదళ్ రీజనల్ కోఆర్డినేటర్ తలారి రాజేంద్ర అన్నారు. ఆయన గురువారం డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాలువా కప్పి సత్కరించారు.

ఆర్సీపురంలో భారీ వర్షం

రామచంద్రాపురం: ఆర్సీపురంలో గురువారం మధ్యాహ్నం గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వేరుశనగ నూర్పిడికి అంతరాయం కలిగింది. మామిడి కాయలు నేల రాలాయి. ఈ క్రమంలోనే నెత్తకుప్పం జయరాం నగర్‌లో ఎండిన కొబ్బరిచెట్టు నేలకొరిగింది. అందులోని రామచిలుకలు కింద పడి మృతి చెందాయి. వాటి చుట్టూ రామచిలుకలు తిరగడం పలువురిని కలచి వేసింది.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలను అందజేస్తున్న చైర్మన్ మధుబాల

తిరుపతి అర్బన్: పాఠకులు కోరినట్లుగా వారికి విద్యార్థులకు ఉపయోగకరమైన పుస్తకాలను రూ.71,563లతో కొనుగోలు చేసినట్లు గ్రంథాలయాల జిల్లా చైర్మన్ మధుబాల పేర్కొన్నారు. ఆమె గురువారం కొత్తగా కొనుగోలు చేసిన పుస్తకాలను తిరుపతిలోని గ్రేడ్–1 గ్రంథాలయం నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రాంథాలయాల అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లావణ్య, ఉద్యోగులు శివప్రసాద్, గజేంద్ర బాబు, ధనుంజయులు, మునీంద్ర, మురళి, గోవిందరాజులు, జీవన్‌సాయి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పాకాల: చెన్నుగారిపల్లి పంచాయతీ మణిపిరెడ్డిపల్లి దళితవాడకు చెందిన లత, భరత్‌కు పెళ్లి నిశ్చయమైంది. వారికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను గురువారం సర్పంచ్ కళావతి, మాజీ జెడ్పీటీసీ పవన్‌కుమార్ అందజేశారు. లక్ష్మయ్య, రవితేజ, కార్తీక్ పాల్గొన్నారు.



బంగారం:

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,040
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,452

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,100
రిటైల్ వెండి గ్రాము	రూ.73.10

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	24
చిత్తూరు	35	24
తిరుమల	31	21
గూడూరు	34	26
నగరి	36	26

శ్రీవారి సేవలో క్రికెటర్ దీపక్ చాహర్



క్రికెటర్ దీపక్ చాహర్

తిరుమల : భారత క్రికెటర్ దీపక్ చాహర్ గురువారం ఉదయం వీఐపీ జనరల్ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మళ్లీ చిరుత కలకలం

పాకాల: మండలంలోని లింగనపల్లి పంచాయతీ సమీపంలో చిరుత సంచారంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్థానికుల కథనం మేరకు గురువారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో పెనుమూరు మార్గం నుంచి కనముందరపల్లి సమీపంలో ఆటో ప్రయాణికులతో వెళుతుండగా 5 అడుగుల దూరంలో చిరుత పులి వెళ్లింది. స్థానికులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడి చేరుకుని గ్రామస్తుల సహకారంతో చుట్టు ప్రదేశాలను పరిశీలించారు. తిరిగి 12 గంటల ప్రాంతంలో చిరుత పులి ఉదయం వెళ్లిన మార్గానికి కొంత దూరంలో తూర్పు నుంచి పడమర వైపు వెళ్లడాన్ని పెనుమూరు నుంచి వస్తున్న ప్రయాణికులు గమనించారు. అటవీశాఖ అధికారులు స్పందించి గ్రామస్తులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

జిల్లా జడ్జి పోస్టుల ఫలితాలు విడుదల

తిరుపతిలీగల్ : గత ఏడాది నిర్వహించిన జిల్లా జడ్జి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల వివరాలను రాష్ట్ర హైకోర్టు వెబ్‌సైట్‌లో గురువారం విడుదల చేసింది. 145 మంది సాధించిన మార్కులు, ఇతర వివరాలను హైకోర్టు పేర్కొంది.

26న ఉచిత స్కానింగ్ రద్దు

తిరుపతి తుడా: స్విమ్స్‌లో గర్భిణులకు ప్రతి ఆదివారం అల్ట్రా సౌండ్ స్కానింగ్ ఉచితంగా నిర్వహిస్తారు. 26వ తేదీన కొన్ని కారణాల వల్ల స్కానింగ్ రద్దు చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ రామ్ తెలిపారు. తర్వాత ఆదివారం నుంచి యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఎర్రావారిపాళెం: ఉదయమానిక్యం, చెరుకువారిపల్లి పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో అమరనాథ్ గురువారం పరిశీలించారు. అనంతరం సచివాలయంలో రికార్డులను తనిఖీ చేశారు.

26న బలిజ వధూవరుల వివాహ పరిచయ వేదిక



వివాహ పరిచయ వేదిక కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బలిజ జేఏసీ నేతలు

తిరుపతి కల్చరల్: తిరుపతి కర్నాల వీధిలోని హోటల్ శ్రీగురులక్ష్మిలో ఆదివారం బలిజ వధూవరుల వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు బలిజ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళ్వారు మురళి తెలిపారు. వారు గురువారం బలిజ సంఘ కార్యాలయంలో వివాహ పరిచయ వేదిక కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పరిచయ వేదికలో పాల్గొనదలిచిన వారు 25వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మ్యాక్సీ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని రావాలని చెప్పారు. తాము ఇచ్చే దరఖాస్తుల్లో వివరాలు నమోదు చేసుకోవాలని, వాటిని ఎల్‌సీడీ ప్రాజెక్ట్ ద్వారా తెలియజేస్తామన్నారు. నచ్చిన వధూవరుల ఫోన్ నంబర్లు అందించి వారి వివాహానికి సహకారం అందజేస్తామని తెలిపారు. వివరాలకు 9985013529, 9398314847లో సంప్రదించాలని కోరారు. బలిజ జేఏసీ నేతలు రవీంద్ర, చెంచుకృష్ణ, సుబ్రమణ్యం, చిట్టిబాబు, శంకరప్ప, నాగేశ్వరావు పాల్గొన్నారు.

చెత్తను సద్వినియోగం చేసుకుందాం

తిరుపతి రూరల్: పల్లెల్లో ఇళ్ల నుంచి సేకరించే చెత్తను సద్వినియోగం చేసుకుంటే పంచాయతీలకు ఆదాయం పెరుగుతుందని పెరుమాళ్లపల్లి సర్పంచ్ జె.మోహన్ పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ రెండో విడతలో భాగంగా చెత్త నిర్వహణపై తిరుపతి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, వెటర్నరీ, వ్యవసాయ అసిస్టెంట్లు, గ్రీన్ అంబాసిడర్లకు ఒకరోజు శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లిలోని లోకల్ ట్రైనింగ్ సెంటర్‌లో తిరుపతి రూరల్, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల అధికారులకు శిక్షణ ఇచ్చారు. పంచాయతీ సీనియర్ కార్యదర్శి, కార్యక్రమ ప్రధాన శిక్షకులు మధుసూదన్ ఆధ్వర్యంలో 14 అంశాలపై అవగాహన కల్పించారు. ఉపసర్పంచ్ వెంకటరమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్, జానకీరామరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తర కర్మక్రియల నిలయం ప్రారంభం

పాకాల: మండలంలోని మొగరాల పంచాయతీ కృష్ణాపురంలో పుణ్యాదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఉత్తర కర్మక్రియల నిలయాన్ని గురువారం ప్రారంభించారు. గతంలో ఉత్తర కర్మక్రియలు నిర్వహించేందుకు మృతుల కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో లయన్ రేచర్ల దొరస్వామి, కోమల దంపతులు రూ.70 వేలు అందజేసి నిలయాన్ని నిర్మించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘునాథనాయుడు, కార్యదర్శి మారసాని విజయబాబు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రామయ్య, జయరామనాయుడు, కుప్పుస్వామినాయుడు, కృష్ణాపురం మాజీ సర్పంచ్ ఆనందనాయుడు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్వీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం

తిరుమల: శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల 51వ వార్షికోత్సవం శుక్రవారం జరగనుంది. ముఖ్య అతిథులుగా మద్రాస్ ఐఐటీ డైరెక్టర్ ఆచార్య వి.కామకోటి, రేమాండ్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సంజీవ్ శరీన్, సింఘానియా విద్యా సంస్థల డైరెక్టర్ రేవతి శ్రీనివాసన్ హాజరుకానున్నారు. వసుధైక కుటుంబం పేరిట నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తారు. పాఠశాల హెచ్ఎం కె.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పోలీస్ స్టేషన్‌కు చేరిన పదో తరగతి ప్రశ్నాపత్రాలు

రామచంద్రాపురం: పదో తరగతి ప్రశ్నాపత్రాలు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కస్టోడియన్ వేణుగోపాల్ వాటిని ట్రంకు పెట్టెల్లో పెట్టి సీల్ వేసి స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. మండలంలోని 9 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 282 మంది పదో తరగతి విద్యార్థులు ఏప్రిల్ 3వ తేదీన పరీక్షలు రాయనున్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు

ఎర్రావారిపాళెం: మండలంలోని యల్లమంద పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రత్యేక నిధులు రూ.22 లక్షలతో ఈడిగపల్లి, గజ్జలవారిపల్లె, గుట్టకిందపల్లికి మెటల్ రోడ్డు, రూ.28 లక్షలతో యల్లమంద క్రాస్, కర్ణంవారిపేట, గంగిరెడ్డిగారిపల్లె రోడ్డు, మర్రిమాకులపల్లె – ముక్కరవాండ్లపల్లి రోడ్డు పనులు చేపట్టారు.













బాలుడిపై వీధి కుక్క దాడి

పాకాల: కుక్క దాడిలో మూడేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాకాల పంచాయతీ కరీంతుల్లా బాద్‌లో నివాసం ఉంటున్న బాలాజి, కీర్తన దంపతుల కొడుకు డి.కరీష్‌రాజ్ (3) బుధవారం ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నాడు. వీధి కుక్క అక్కడికి చేరుకుని బాలుడిపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని కుటుంబ సభ్యులు సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. మాంసం దుకాణదారులు వేస్టును తమ ఇంటి పరిసరాల్లో వేస్తున్నారని, వాటిని తినేందుకు కుక్కలు వచ్చి దాడి చేస్తున్నాయని స్థానికులు ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తిరుచానూరుకు రూ.2.55 కోట్ల ఆదాయం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు గ్రామ పంచాయతీ టూరిస్ట్ బస్టాండ్ పార్కింగ్ వేలం పాట ద్వారా రూ.2.55 కోట్లు ఆదాయం చేకూరింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఈఓపీఆర్డీ నీలకంఠేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ వేలం పాట నిర్వహించారు. తిరుచానూరుకు చెందిన ధరణి అండ్ కో కంపెనీ ప్రతినిధి నాగిరెడ్డి రూ.2,55,03,000లకు దక్కించుకున్నాడు. గత ఏడాది బస్టాండ్ రూ.2.72 కోట్లకు పలికింది. దుకాణాల వేలం పాటలకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాటిని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనారాయణ తెలిపారు. త్వరలోనే వాటికి కూడా వేలం పాట నిర్వహిస్తామన్నారు.

విరించి-2కే23 పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 11, 12వ తేదీల్లో విరించి–2కే23 పేరుతో జాతీయ స్థాయి కల్చరల్ ఫెస్ట్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్, టీజర్, బ్రోచర్, వెబ్‌సైట్‌ను గురువారం ఇన్‌చార్జ్ వీసీ కె.రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఎస్.రజని, ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ పి.మల్లికార్జున, అధ్యాపకులు, విద్యార్థులు ఆవిష్కరించారు.













